సాక్షి
వైఎస్సార్ జిల్లా

సోమవారం । 1 । ఏప్రిల్ । 2024



వైఎస్‌ఆర్‌సీపీలోకి చేరికలు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీలోకి చేరికలు ఊపందుకున్నాయి. ఆదివారం సింహాద్రిపురం మండలం, కడపలో పలువురు టీడీపీ నాయకులు పార్టీలో చేరారు. -8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమ (సా॥)	సహర్ మంగళ (ఉ॥)
కడప	: 6.31	4.55
పులివెందుల	: 6.34	4.50
ప్రొద్దుటూరు	: 6.33	4.59

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 40.8/25.0

జిల్లాలో ఆదివారం 25.0 – 40.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

మూల్యాంకనం విధుల నుంచి ఎవరికి మినహాయింపు లేదు

కడప ఎడ్యుకేషన్: నేటి నుంచి ప్రారంభం కానున్న పదోతరగతి సమాధాన పత్రాల మూల్యాంకనానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేయాలని పది పరీక్షల జిలాల అబ్జర్వర్ మార్తాల వెంకట క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కడప మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో ఏర్పాటు చేసిన పది మూల్యాంకన కేంద్రాన్ని డీఈఓ మర్రెడ్డి అనురాధ, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ వెంకటేష్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అత్యవసరమైతే తప్ప ఎవరికి కూడా మూల్యాంకన విధులకు నుంచి మినహాయింపు ఇవ్వకూడదన్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

సంగమేశ్వరునికి రూ. 4.59లక్షల ఆదాయం



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

వీపునాయునిపల్లె: మండలంలోని సంగమేశ్వరాలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు ఈఓ జగన్‌మోహన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ శివాంజనేయరెడ్డి తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ మహాశివరాత్రి పండుగ రోజున దర్శన టికెట్‌ల ద్వారా రూ. 78వేలు వచ్చిందన్నారు. ఆరు నెలలకు సంబందించి హుండీ ద్వారా 3.81లక్షల రూపాయల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు సుబ్రమణ్య శర్మ తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం



నారాయణస్వామికి నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల టౌన్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా అంబకపల్లె నారాయణస్వామిని నియమించారు. ఆదివారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నివాస ప్రాంగణంలో నియామక పత్రాన్ని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా అంబకపల్లె నారాయణస్వామి మాట్లాడుతూ తనకు బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ మదన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ అభిషేక్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

కోడ్ ఉల్లంఘన.. బీజేపీ నాయకుడిపై కేసు

మదనపల్లె: మాజీ ముఖ్యమంత్రి, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి స్వాగతం పలుకుతూ శనివారం నిర్వహించిన వాహనాల ర్యాలీకి సంబంధించి,ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన కారణంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగవాన్‌పై కేసు నమోదైనట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి వాహనాల ర్యాలీకి సంబంధించి ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై అధికారులకు ఫిర్యాదులు అందాయి. వాహనాల ర్యాలీకి సంబంధించి మదనపల్లె బీజేపీ నాయకులు భగవాన్ తొమ్మిది వాహనాలకు ఎన్నికల అధికారి నుంచి అనుమతులు పొందారు. అయితే ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వందల సంఖ్యలో వాహనాలతో ర్యాలీ నిర్వహించడంతో, ఎన్నికల కోడ్ ఉల్లంఘించారంటూ ఎంపీడీఓ భానుప్రసాద్ తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు భగవాన్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు.

చీప్ ట్రిక్స్..



ఈ ఫొటోలో పచ్చ కండువా కప్పించుకుంటున్న వ్యక్తి కడప బాలాజీనగర్‌కు చెందిన మాజీ కార్పొరేటర్ రాజశేఖరరెడ్డి. టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన ఆయన టీడీపీ అభ్యర్థి మాధవీరెడ్డి సమక్షంలో తిరిగి టీడీపీలో చేరారు. టీడీపీ నేతగా గత కొంతకాలంగా కడపలో చలామణీ అవుతున్నారు. అంతలోనే చంద్రబాబు వద్ద మరోమారు అదే మాజీ కార్పొరేటర్‌కు టీడీపీ కండువా కప్పించారు. వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి చేరికలంటూ ప్రచారం చేసుకున్నారు.



- తెలుగుతమ్ముళ్లకే కండువాలు వేసుకుంటున్న టీడీపీ నేతలు
- అనుకూల మీడియాలో మద్దతు పెరుగుతున్నట్లు ప్రచారం
- నాన్ లోకల్ నాయకులు అభ్యర్థులు కావడంతో ప్రచారం కోసం తాపత్రయం
- సీఎం జిల్లా పర్యటన తర్వాత జోష్ మీదున్న వైఎస్సార్‌సీపీ

ఇతను ప్రొద్దుటూరు 22వ కౌన్సిలర్ మహమ్మద్‌గౌస్. టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తీసుకెళ్లి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేర్పించారు. మూడు నెలల క్రితం ఈ ఘటన చోటు చేసుకుంది. తాజాగా మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మరోమారు టీడీపీ కండువా కప్పి, తెలుగుదేశం పార్టీలో చేరినట్లు ప్రచారం చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి చేరికలను టీడీపీ ప్రోత్సహిస్తోంది.



సాక్షి ప్రతినిధి, కడప: అంతంత మాత్రమే ఉన్న ప్రజా మద్దతు... ఎక్కడికెళ్లిన ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ప్రతిఘటన. పైగా నాన్ లోకల్ ఎఫెక్ట్.. ఇవన్నీ మరిపించేందుకు తెలుగుదేశం అభ్యర్థులు 'చీప్ ట్రిక్స్'కు పాల్పడుతున్నారు. వలసల ఉధృతి అంటూ ప్రచార ఎత్తుగడలకు పాల్పడుతున్నారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు అనువుగా ఎల్లోమీడియా ప్రచారం కల్పిస్తోంది. వాస్తవంలో టీడీపీ నాయకులు నిర్ణయాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించడంలో విఫలమయ్యారు. ఐదేళ్లుగా ప్రజల చెంతకు చేరకుండా ఉనికి కోసం మమ అన్పిస్తూ కాలక్షేపం చేశారు. ఎన్నికలు సమీపించే కొద్దీ 'చీప్ ట్రిక్స్' ప్రదర్శిస్తూ ప్రజల్లో చర్చకు ఆస్కారం ఇస్తున్నారని పరిశీలకులు చెబుతున్నారు.

నాన్ లోకల్ అభ్యర్థిత్వం మరిపించేందుకు....

జిల్లాలో టీడీపీకి స్థానికంగా అభ్యర్థులు కరువయ్యారు. పార్టీ కోసం కష్టపడిన నాయకులున్నా, డబ్బులున్నవారికే ఆ పార్టీ అధిష్టానం టికెట్లు కట్టబెట్టింది. ఈ కోవలో కడప, రాజంపేట అభ్యర్థులు మాధవీరెడ్డి, సుగవాసి బాలసుబ్రమణ్యం పేర్లు చెప్పవచ్చు. ఇద్దరు రాయచోటి నియోజకవర్గానికి చెందిన వారు. కడపకు మాధవీరెడ్డి అభ్యర్థిత్వం ఖరారయ్యాక సోషల్ మీడియాలో ఫోకస్ కోసం తాపత్రయం పడుతున్నారు. లేని ఊపును సృష్టించుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. ఎక్కడో నివాసం ఉంటూ రాజకీయాలకు దూరంగా ఉన్నా మాధవీరెడ్డి సోషల్ మీడియాలో పొందుతున్న ప్రచారాన్ని పసిగట్టిన టీడీపీ అభ్యర్థులు అదే దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రొద్దుటూరులో ఈవీ సుధాకర్‌రెడ్డి, ముక్తియార్, కడపలో చలపతి, సత్య లాంటి నేతలకు తాజాగా కండువాలు కప్పడమని పలువురు ఉదహరిస్తున్నారు. మరోవైపు ఐదేళ్లు టీడీపీ కోసం కష్టపడిన వారిని కాదని అభ్యర్థిత్వాలు ఖరారు చేయడం కూడా ఇలాంటి 'చీప్ ట్రిక్స్'కు ప్రధాన కారణంగా పలువురు చెప్పుకొస్తున్నారు. రాజంపేటలో కూడా ఇలాంటి పరిస్థితే తెరపైకి వచ్చింది. స్థానిక నాయకులను కాదని రాయచోటికి చెందిన సుగవాసి సుబ్రమణ్యం అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. ఇంకా ప్రచా రం చేపట్టిన ఆయన ఇలాంటి ఎత్తుగడలతోనే ముందుకు వెళ్లేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు సమాచారం.

వైఎస్సార్‌సీపీలో జోష్...

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన తర్వాత వైఎస్సార్‌సీపీ జోష్ మీదున్నట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. పైగా నా హయాంలో మీకుటుంబానికి లబ్ధి చేకూరి ఉంటేనే మీ బిడ్డను మరోమారు ఆశీర్వదించండి. తర తమ భేదం లేకుండా పేదలకు మేలు చేసి ఉంటేనే ఓట్లు వేయండని ధైర్యంగా అభ్యర్థిస్తుండడం వైఎస్సార్‌సీపీకి అదనపు అర్హత అయిందని పరిశీలకులు చెప్పుకొస్తున్నారు. ఈ పరిణామం తెలుగుదేశం పార్టీకి రుచించడం లేదు. దీంతో టీడీపీ నేతలు వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారు. 'మేమంతా సిద్ధం'కార్యక్రమం తర్వాత వైఎస్సార్‌సీపీ ఊపు పెరగడమే అందుకు కారణమని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గ స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అనేక మంది టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి, మైదుకూరులో రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, రవిశంకర్‌రెడ్డి, కొండారెడ్డి, కమలాపురంలో సాయినాథశర్మ లాంటి నాయకులు వచ్చి చేరడాన్ని పలువురు ఉదహరిస్తుండడం విశేషం.

నేటి నుంచి పది మూల్యాంకనం

ఏర్పాట్లు సిద్ధం చేసిన విద్యాశాఖ అధికారులు

కడప ఎడ్యుకేషన్: పదోతరగతి పరీక్షల మూల్యాంకనం సోమవారం (ఏప్రిల్1) నుంచి కడపలోని మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. మూల్యాంకన ప్రక్రియ ఏప్రిల్ 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు జరగుతుంది. ఇప్పటికే వివిధ జిల్లాల నుంచి వచ్చిన పరీక్ష పేపర్లకు కోడింగ్ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. మూల్యాంకనానికి 901 మంది సిబ్బందిని ఏర్పాటు చేశారు. వీరిలో అసిస్టెంట్ ఎగ్జామినర్లు, చీఫ్ ఎగ్జామినర్లు, స్పెషల్ అసిస్టెంట్లు ఉన్నారు. ఇందులో జిల్లా విద్యాశాఖ అధికారి మర్రెడ్డి అనురాధ క్యాంపు ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు.

విడతల వారిగా..

ఈ ఏడాది వివిధ జిల్లాల నుంచి వచ్చిన 1,92,080 జవాబు పత్రాలను ఇక్కడ మూల్యాంకనం చేయనున్నారు. ఇందుకోసం 901 మంది సబ్జెక్టు టీచర్లను విద్యాశాఖ నియమించింది. మూల్యాంకన కేంద్రంలో జిల్లా విద్యాశాఖ అధికారి క్యాంపు ఆఫీసర్‌గా, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమీషనర్ డిప్యూటీ క్యాంపు ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు. ప్రతి గ్రూపునకు ఒక చీఫ్ ఎగ్జామినర్(సీఈఓలు), ఆరుగురు సహాయ ఎగ్జామినర్లు(ఏఈలు), ఇద్దరు స్పెషల్ అసిసెంట్లు(ఎస్పీఏ) పాల్గొంటారు. ప్రతి సహాయక ఎగ్జామినర్ రోజుకు 40 పేపర్లను మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది.

ఇవీ నిబంధనలు: మూల్యాంకన విధులకు హాజరయ్యే ఉపాధ్యాయులు సెల్‌ఫోన్, స్మార్ట్‌ఫోన్లు, ఎరైజర్, వైట్నర్ తదితర వస్తువులను మూల్యాంకన కేంద్రంలోకి తీసుకెళ్లరాదు.



డీఈఓ అనురాధతో కలిసి మూల్యాంకన కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అబ్జర్వర్ వెంకట క్రిష్ణారెడ్డి

- ప్రతి రోజు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మూల్యాంకనం జరుగుతుంది. మూల్యాంకన కేంద్రంలో ఎటువంటి తప్పిదాలు జరిగినా ఉపాధ్యాయులే బాధ్యత వహించాల్సి ఉంటుంది.
- సిబ్బంది సమయానికి హాజరు కావాలి. లేకుంటే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

పక్కాగా ఏర్పాట్లు...

పది మూల్యాంకనానికి అన్ని ఏర్పాట్లు చేశాం. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన విషయం కాబట్టి మూల్యాంకనం విధుల్లో ఉన్న సిబ్బంది చాలా జాగ్రత్తగా విధులు నిర్వహించాలి. మార్కులను టోటల్ చేసేటప్పుడు ఒకటికి రెండు సార్లు సరి చూసుకోవాలి.

– మర్రెడ్డి అనురాధ, డీఈఓ, క్యాంపు ఆఫీసర్, కడప

మూల్యాంకనం చేయాల్సిన జవాబు పత్రాల వివరాలు...

సబ్జెక్టు	అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు	ఆన్సర్ పేపరు	చీఫ్ ఎగ్జామినర్స్	అసిస్టెంట్ ఎగ్జామినర్స్	స్పెషల్ ఎగ్జామినర్స్
తెలుగు	1	29392	15	92	30
హిందీ	1	22099	12	69	24
ఇంగ్లీస్	1	16610	09	52	18
మ్యాథ్స్	1	32936	17	103	34
ఫిజికల్‌సైన్సు	1	29550	15	92	30
బయలాజికల్‌సైన్సు	1	32404	17	101	34
సోసియల్ స్టడీ	1	29090	15	92	30

సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ గెలిపించండి

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

సింహాద్రిపురం: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను ఇంటి ముంగిటకే అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. అందువల్ల ప్రజలు జగనన్న మళ్లీ గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం సింహాద్రిపురం మండలంలోని భానుకోట శైవ క్షేత్రంలో పూజలు నిర్వహించి ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన అహోబిలాపురం, రావులకొలను గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నను, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు. ముందుగా వైఎస్సార్‌సీపీ అభిమాని రామాంజులరెడ్డి రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాలు, 25 ఎంపీ స్థానాలు గెలుపొందాలని 200 టెంకాయలను సమర్పించే కార్యక్రమాన్ని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఎన్నికల పరిశీలకులు గండ్లూరు వీరశివారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.గ్రామాల్లో మహిళలు వైఎస్ అవినాష్‌రెడ్డికి హారతులు పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాల పాటు కరోనా సమయంలో కోవిడ్ కష్టాలు ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. రావులకొలను గ్రామంలో నూతన వధూవరులైన ఖమ్మం బాబురెడ్డి, భారతీలను ఆయన ఆశీర్వదించారు.వైఎస్సార్‌సీపీ నాయకులు రామ్మోహన్‌రెడ్డి, కిశోర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ మహేశ్వరరెడ్డి, సోమేశ్వరరెడ్డి, వెంకటరామిరెడ్డి, చెన్నకేశవరెడ్డి, వెంకటనారాయణరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకటరెడ్డి, శివభాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, మల్లేశ్వర్‌రెడ్డి, రవీంద్రనాథరెడ్డి, గురునాథరెడ్డి, చిరంజీవిరెడ్డి, షరీఫ్, రాజారెడ్డి, మల్లికార్జున యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

- సింహాద్రిపురం మండలంలోని గ్రామాల్లో ముస్లిం సోదరులు వైఎస్ అవినాష్‌రెడ్డికి విజయ కంకణం కట్టి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



సింహాద్రిపురం మండలం భానుకోటలో చేపట్టిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



అవ్వను ఓటు అభ్యర్థిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

అవ్వాతాతల ఉసురు చంద్రబాబుకు తగులుతుంది

పులివెందుల : వలంటీర్ల ద్వారా అవ్వాతాతలకు ఫించన్‌లు అందించే కార్యక్రమాన్ని కోర్టు ద్వారా అడ్డుకున్న చంద్రబాబుకు వారి ఉసురు తప్పకుండా తగులుతుందని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అభివర్ణించారు. ఆదివారం ఆయన పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురం మండలంలోని అహోబిలం, రావులకొలను.. లింగాల మండలంలోని అంబకపల్లె గ్రామాలలో ఇంటింటికి వైఎస్సార్సీపీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో ప్రతినెల 1వ తేదీ వలంటీర్లు ఇంటికి వెళ్లి ఫించన్ ఇచ్చేవారన్నారు. కానీ చంద్రబాబు ఎన్నికల కమిషన్‌కు పిటిషన్ పెట్టి వలంటీర్లను విధుల నుంచి తాత్కాలికంగా పక్కన పెట్టేలా చేయడం సరికాదని ఎంపీ అన్నారు.

పరిపాలనలో మార్పులు తీసుకొచ్చాం

లింగాల మండలంలోని అంబకపల్లెలో మండల ఇన్‌చార్జి వైఎస్ అభిషేక్‌రెడ్డితో కలిసి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఆదివారం నుంచి నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించామని, ఇందులో భాగంగా గడిచిన ఐదేళ్లలో జగనన్న ఇచ్చిన హామీలు చేయూత, ఆసరా, అమ్మ ఒడి, ఈ విధంగా చెప్పిన ప్రతి పథకాన్ని అమలు చేసిన విషయాన్ని ప్రజలకు వివరిస్తున్నామని చెప్పారు. అదేవిధంగా పరిపాలనలో అనేక మార్పులు తీసుకొచ్చామని తెలిపారు. పులివెందుల నియోజకవర్గంలో గడచిన ఐదేళ్లలో సాగునీటిరంగంపై ప్రత్యేకదృష్టి పెట్టామన్నారు. అలాగే పులివెందుల, సింహాద్రిపురం, వేంపల్లె పట్టణాలను అభివృద్ధి చేశామని వివరించారు. ముఖ్యంగా లింగాల బ్రాంచ్ కెనాల్‌ను మరింత పెంచినట్లు చెప్పారు. పులివెందుల బ్రాంచ్‌కెనాల్ వాటర్ కూడా టెయిలెండ్ వరకు వెళ్తున్నాయన్నారు. కొత్తపల్లె డిస్ట్రిబ్యూటరీ నుంచి పులివెందుల బ్రాంచ్ కెనాల్‌ను జీఎన్‌ఎస్‌ఎస్ కెనాల్‌కు కలపడం జరిగిందన్నారు. మైక్రోఇరిగేషనల్ భాగంగా ఇప్పటికి 67సంపులు దాదాపు 8500 ఎకరాలకు నీరందించే విధంగా కార్యక్రమాలు రూపొందించామన్నారు. అదేవిధంగా జీకెఎల్‌ఐకి సంబంధించి కూడా పెండింగ్ పనులు చివరి దశకు చేరుకున్నాయి. జీకెఎల్ఐ ద్వారా మల్లేల, లోమడ, గంగాదేవిపల్లె, నారేపల్లె వరకు అన్ని చెరువులకు నీరందుతున్నాయన్నారు. గడిచిన 18 మాసాల నుంచి వర్షాలు లేక తీవ్రమైన కరువు ఉంది. అయినా ఈ నియోజకవర్గంలోని ఏ ఒక్క గ్రామంలో నీటి ఎద్దడి లేదంటే జగనన్న ప్రభుత్వం సాగునీటి రంగంపై శ్రద్ధ వహించి చెరువులకు నీరు నింపడమే కారణమన్నారు. జగనన్న సీఎం అయ్యేనాటికి గండికోటలో 5 నుంచి 6 టీఎంసీలు నీరు మాత్రమే నిల్వ ఉంచుకునే పరిస్థితి ఉండేది. జగనన్న సీఎం అయిన తర్వాత రూ.900కోట్లు ఆర్‌ఎన్‌ఆర్ గ్రామాల ప్రజలకు చెల్లించి 25టీఎంసీలు నింపడం జరిగిందన్నారు. రూ.250కోట్లు 4 గ్రామాలకు సంబంధించిన ప్రజలకు అందించి ఇవాళ చిత్రా వతిలో 10టీఎంసీల నీరు నిల్వ చేసినట్లు వివరించారు. ఇంత పెద్ద ఎత్తున నీరు తెచ్చాం కాబట్టే కరువును సమర్థవంతంగా ఎదుర్కొంటున్నామని తెలిపారు.

వలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు టీడీపీ కుట్ర

ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం: వలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకే తెలుగుదేశం పార్టీ కుట్ర పన్నిందని, వలంటీర్ వ్యవస్థ లేక పోతే పింఛన్ల పంపిణీలో తీవ్ర ఇబ్బంది జరుగుతుందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. ఆదివారం కమలాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి నెలా 1వ తేదీ తెల్లవారుజామున నుంచే వలంటీర్లు ఇంటింటికి వెళ్లి పింఛన్ పంపిణీ చేస్తున్నారన్నారు. టీడీపీ కుట్రలో భాగంగానే నిమ్మగడ్డ కోర్టుకు వెళ్లి వలంటీర్లను విధులకు దూరం చేశారన్నారు. వికలాంగులు, వితంతువులు, వృద్ధులు 1వ తేదీ పింఛన్ రాకపోతే ఎంత ఇబ్బంది పడతారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిమ్మగడ్డ ఐఏఎస్ అధికారిగా పని చేశారని, వలంటీర్లను విధులకు దూరం చేయడం ఎంత వరకు సమంజసం అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ప్రభుత్వం అందించే ప్రతి పథకం నేరుగా లబ్ధిదారులకు చేరాలన్న ఉద్దేశంతోనే జగనన్న ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థను టీడీపీ అడ్డుకుంటోదన్నారు. ఎవరైనా బాగుంటే చంద్రబాబుతో పాటు టీడీపీ నాయకులకు కడుపు, కళ్లు మంట అన్నారు. రాష్ట్ర ప్రజల దీవెనలు జగనన్నకే ఉన్నాయని, సిద్ధం, మేమంతా సిద్ధం సభలే అందుకు నిదర్శనమని ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు.

అధర్మంపై న్యాయానిదే విజయం



కేక్ కట్ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా



ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు

ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా

కడప కల్చరల్: అధర్మంపై న్యాయానిదే విజయమని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. ఆదివారం కడప నగరంలోని ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో ఈస్టర్ పుణ్యదినాన్ని పురస్కరించుకుని ఆయన ముఖ్యఅతిథిగా రాత్రి నిర్వహించిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీస్తును అన్యాయపు తీర్పును ఇచ్చి శిలువ ఎక్కించారని, ఆయన తన రక్తాన్ని చిందించి తన దుర్దశకు కారణమైన పాపులకు సైతం మోక్షమార్గం ప్రసాదించారని తెలిపారు. అలాంటి నిజాయితీపరులకు చావులేదని, అధర్మంపై న్యాయానిదే అంతిమ విజయమన్నారు. ఈ సందర్భంగా ఆయన కథోలిక మేత్రాసన వికర్‌జనరల్ రెవరెండ్ బాలరాజుతో కలిసి క్రీస్తు పునరుత్థాన కేక్‌ను కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభువును అనుసరించినవారికి మరణం లేదని, శారీరకంగా మరణించినా అది తాత్కాలికమేనన్నారు. మరణం మన దరికి చేరకుండా ప్రభువు మనతో ఉన్నారని తెలిపారు. పాస్టర్ గుడిమె దైవసహాయం కూడా ఈస్టర్ సందేశం అందజేశారు. ఈ సందర్భంగా క్రైస్తవ గురువులు ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజద్‌బాషాను సత్కరించారు. ఆయన క్రైస్తవులందరికీ పునరుత్థాన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ ఎండీ ప్రసాద్‌రావు, సహాయ డైరెక్టర్ విల్సన్, పాదర్ నాగిపోగు బాబు, డాన్‌బోస్కో గురువులు, ఆరోగ్యమాత, జేఎంజే మదర్‌లు, చర్చి పెద్దలు, శాంతిసేవాసొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మడగలం ప్రసాద్, కథోలిక విశ్వాసులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

కానిస్టేబుల్ ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని డ్రైవర్ కొట్టాలలో నివాసం ఉంటున్న బైరి బాలవాసు (37) అనే కానిస్టేబుల్ ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. కానిస్టేబుల్ బాలవాసు కలమల్ల పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్నాడు. గతేడాది డిసెంబర్‌లో పులివెందులలోని జెండామాను వీధిలో తన భార్య జానకిని గొంతు నులిమి హత్య చేశాడు. ఈ కేసులో పులివెందుల పోలీసులు బాలవాసును అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. అతనిపై హత్య కేసు నమోదు కావడంతో పోలీసు ఉన్నతాధికారులు అతన్ని ఉద్యోగం నుంచి సస్పెండ్ చేశారు. ఈ క్రమంలో రిమాండులో ఉన్న అతను వారం రోజుల క్రితం బెయిల్‌పై బయటికి వచ్చాడు. డ్రైవర్ కొట్టాలలోని తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో అతను ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్యను హత్య చేయడంతో తన జీవితం గురించి తలుచుకుంటూ రోజూ అతను మథన పడేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలోనే అతను ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ సీఐ వెంకటరమణ తెలిపారు.

నాటు సారా ఊట ధ్వంసం


నాటు సారా ఊటలు ధ్వంసం చేసిన దృశ్యం

కొండాపురం : నాటుసారా తయారీ ఊటలను ధ్వంసం చేసి నాగేష్ నాయక్‌ను అరెస్ట్ చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ ఆదివారం తెలిపారు. మండలంలోని దొబ్బుడుపల్లె గ్రామ సమీపంలో నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం ఉమ్మాయపల్లె గ్రామానికి చెందిన నాగేష్ నాయక్ నాటు సారా తయారీ చేస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. నాటు సారా 600 లీటర్ల ఊటలను ధ్వంసం చేశామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


కంప చెట్లలో రసూల్ మృతదేహం

వేముల : మండలంలోని మబ్బు చింతలపల్లి క్రాస్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పులివెందులకు చెందిన రసూల్ ఎస్‌ఎంఎస్ కంపెనీలో పని చేస్తుండే వాడు. అతను రాత్రి విధుల నిమిత్తం వెళ్తుండగా మోటార్ సైకిల్ అదుపు తప్పి మృతి చెందాడా, గుర్తు తెలివాహనం ఢీకొని ఈ ప్రమాదం జరిగిందా అనే విషయం తెలియాల్సి ఉంది. సంఘటన ప్రాంతంలో మోటార్ సైకిల్ పది మీటర్ల దూరంలో పడిపోగా.. వ్యక్తి కంప చెట్లలో పడిపోయాడు. విధులకు వెళ్తున్న కొంత మంది ఉద్యోగులు ఈ సమాచారాన్ని పోలీసులకు తెలిపారు. ఈ సంఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

మేకల కాపరికి గాయాలు

మదనపల్లె : పెంచుపాడు పంచాయతీ కట్టుబావి గొల్లపల్లికి చెందిన సిద్దప్ప (70) ఆదివారం మేకలను మేపేందుకు అడవికి వెళ్లాడు. వాటి మేత కోసం ఆయన చెట్ల కొమ్మలు నరుకుతుండగా చేతిలోని కొడవలి కాలుకు తగలడంతో గాయపడ్డాడు.

ఎలక్ట్రిక్ వాహనాలకు పన్ను మినహాయింపు

- గతేడాది జూన్ నుంచి రోడ్డు ట్యాక్స్ వసూలు
- గత నెల నుంచి మినహాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- 12–18 శాతం సొమ్ము వాహనాదారునికి ప్రయోజనం



ఎలక్ట్రిక్ వాహనం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : విద్యుత్ (ఎలక్ట్రిక్) వాహన యజమానులకు శుభవార్త. ఈ వాహనాలను కొనుగోలు చేసే వారికి రోడ్డు ట్యాక్స్ (పన్ను) నుంచి మళ్లీ మినహాయింపు లభించింది. అన్ని రకాల ఎలక్ట్రిక్ (బ్యాటరీ) వాహనాల కొనుగోలును ప్రోత్సహిస్తూ వాటి వినియోగాన్ని పెంచాలన్న లక్ష్యంతో గతంలో ప్రభుత్వం రోడ్డు ట్యాక్స్‌తోపాటు రిజిస్ట్రేషన్ ఫీజును కూడా రద్దు చేసింది. అయితే గతేడాది జూన్ ఏడో తేదీ నుంచి వీటిలో రోడ్డు టాక్స్‌కు ఇస్తున్న మినహాయింపును రద్దు చేసింది. అప్పటి నుంచి విద్యుత్ వాహనాలకు రోడ్డు పన్ను వసూలు చేస్తోంది. అలా ఈ ఏడాది జనవరి ఆఖరు వరకు ఈ పన్ను వసూలు కొనసాగింది.

ఫిబ్రవరి నుంచి మినహాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఈ–వాహనాలకు రోడ్డు పన్ను నుంచి మినహాయింపునిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రవాణాశాఖ అధికారులు గత ఎనిమిది నెలలుగా వసూలు చేస్తున్న రోడ్డు ట్యాక్స్(మోటార్ వెహికల్ ట్యాక్స్)ను నిలిపి వేశారు. ఫిబ్రవరి ఒకటి నుంచి జులై ఏడో తేదీ వరకు కొనుగోలు చేసే ఈ–వాహనాలకు రోడ్డు పన్ను చెల్లింపు నుంచి మినహాయింపు లభించింది. ఎలక్ట్రిక్ వాహనాల్లో టూ వీలర్లు, ప్రయాణికుల లగేజీ, ఆటోలు, కార్లు, బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాలు, బస్సులు ఉన్నాయి. ప్రభుత్వం ఇచ్చిన వెసులుబాటుతో ఈ వాహనాలు కొనుగోలు చేసే వారు రోడ్డు పన్ను చెల్లించే పని లేదన్న మాట.

12–18 శాతం సొమ్ము వాహనాదారునికి ప్రయోజనం

ప్రస్తుతం రూ.5 లక్షలు విలువ చేసే ఎలక్ట్రిక్ వెహికల్‌కు 12 శాతం, రూ.5–10 లక్షల వాహనానికి 14 శాతం, రూ.10–20 లక్షలు విలువ చేసే వెహికల్‌కు 17 శాతం, రూ.20 లక్షలు పైబడిన వాహనానికి 18 శాతం చొప్పున రోడ్డు పన్ను వసూలు చేస్తున్నారు. ఇకపై ఈ వాహనాలకు రోడ్డు ట్యాక్స్ చెల్లించాల్సిన అవసరం లేదని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు. దీని వల్ల విద్యుత్ వాహనం కొనుగోలుదారునికి కనిష్టంగా రూ.10 వేల నుంచి గరిష్టంగా రూ. 4 లక్షలు వరకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రస్తుతం ప్రభుత్వం ఈ–వాహనాలకు కల్పించిన రోడ్డు ట్యాక్స్‌ను మినహాయింపు అవకాశాన్ని వినియోగదార్లు సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాలో కాలుష్య తీవ్రతను తగ్గించడానికి కృషి చేయాలి.

–ఈ.మీరా ప్రసాద్, జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్

చంద్రబాబు వ్యాఖ్యలపై నిరసన

టిప్పర్ డ్రైవర్ అంటూ హేళనగా మాట్లాడటంపై మండిపాటు


వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన

వేంపల్లె : వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులును చులకనగా చేస్తూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు చేయడం తగదని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కన్వీనర్ ముత్యాల ఆంజనేయులు అన్నారు. ఆదివారం వేంపల్లెలోని వైఎస్సార్ సుమో స్టాండ్ వద్ద తోటి డ్రైవర్లతో కలిసి నల్లబ్యాడ్జీ ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబుపై ఇప్పటికే వివిధ రకాల ఏ1 కేసులు ఉన్నాయని, డ్రైవర్లను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం నుంచి తమ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా టిప్పర్ డ్రైవర్‌ను సీఎం వైఎస్ జగన్ ప్రకటించి తన గొప్ప మనసును చాటుకున్నారన్నారు. అయితే డ్రైవర్లు ఎమ్మెల్యేలుగా పనికిరారా? అంటూ చంద్రబాబును ప్రశ్నించారు. టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులు ఎంఏ, బీఈడీ చదివారని, అప్పట్లో ఉద్యోగం రాక కుటుంబ పోషణ కోసం టిప్పర్ డ్రైవర్ వృత్తిని ఎంచుకున్నారన్నారు. పేదలను, దళితులను చంద్రబాబు చులకన భావంతో చూస్తూ కుల దురహంకారంతో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సుమో స్టాండ్ అధ్యక్షులు నాగేంద్రబాబు, ఉపాధ్యక్షులు రాగోపాల్‌రెడ్డి, సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, మాధవ, వెంకటసుబ్బయ్య, అల్లు, చంద్ర,మౌలాలి, దర్బార్, గౌస్, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీపై ఉమ్మడి పోరాటం


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : విపక్షాలను అణచి వేసేందుకు కుట్ర పన్నుతున్న బీజేపీపై ఉమ్మడిగా పోరాటం చేయాలని కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు నజీర్ అహ్మద్, సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు చంద్ర, చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఇందిరా భవన్‌లో ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. భారత రాజ్యాంగం ప్రజాస్వామ్యం ప్రాబల్యం కలిగినదని, పార్లమెంటు ప్రాబల్యం కలిగినది కాదని, పార్లమెంటు చట్టాలు రాజ్యాంగ లక్ష్యాలకు అనుకూలంగా లేకపోతే, సుప్రీంకోర్టు కొట్టి వేయవచ్చన్నారు. బీజేపీ భారత రాజ్యాంగ పీఠికలోని ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ఫెడరలిజం, సామాజిక న్యాయం, సోషలిజం లక్ష్యాలను విస్మరించి, దేశ విభజన వైపుగా, భావోద్వేగ రాజకీయాలు నడుపుతోందని వీటిని తిప్పి కొట్టాలని పేర్కొన్నారు. బీజేపీ 10 సంవత్సరాల పరిపాలనలో ప్రభుత్వ వ్యవస్థలన్నిటి విశ్వాసనీయతను కోల్పోయే విధంగా, బీజేపీ జేబు సంస్థలుగా మార్చి, ప్రశ్నార్థకం చేసిన ఘనత దక్కించుకున్నదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్ సత్తార్, విష్ణు ప్రీతమ్‌రెడ్డి, చీకటి చార్లెస్, సుజాతరెడ్డి, చిన్న కుల్లాయప్ప, శ్యామలాదేవి, అలీఖాన్, సలావుద్దీన్, న్యాయవాది సుధాకర్, నాగరత్న, గౌరీ, సీపీఎం నాయకులు ఏ.రామ్మోహన్, బి.మనోహర్, సీపీఐ నాయకులు వెంకటశివ, బాదుల్లా, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు డాక్టర్ బి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సన్నపురెడ్డి సేవలు మరువలేనివి


సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

కాశినాయన : కవిగా, ఉపాధ్యాయుడిగా సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి సేవలు మరువలేనివని ప్రధానోపాధ్యాయుడు నాగరాజు కొనియాడారు. ఆదివారం మండలంలోని కోడిగుడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన మండలాల్లోని పలువురు ఉపాధ్యాయులు హాజరై ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ తాను 2022లోనే పదవీ విరమణ పొందే వాడినని, ఒక రోజు ముందు పదవీ విరమణ కాలపరిమితిని 62 ఏళ్లకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. పిల్లలతో తన జీవితం సుఖసంతోషాలతో సాగిందన్నారు. తాను ఉపాధ్యాయుడిగా పని చేస్తూ 7 నవలలు రాశానని, అందులో 'కొండపొలం' నవల ఆధారంగా సినిమా తీశారన్నారు. తాను రచించిన నవలలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అవార్డులు అందుకున్నానని తెలిపారు. ఈ సందర్భంగా మట్టిమనిషి సన్నపురెడ్డి అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సన్నపురెడ్డి కుటుంబ సభ్యులు, బంధువులు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గురుబ్రహ్మం, ఎంఈఓలు ప్రమీల, ప్రమీలరాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వంలో విలీనం ద్వారా ఆర్టీసీ ఉద్యోగులకు మేలు


ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ వెంకటరామిరెడ్డి

బద్వేలు అర్బన్ : ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా ఆర్టీసీ ఉద్యోగులకు ఎంతో మేలు జరిగిందని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బద్వేలు డిపోలో ఆయన ప్రజా రవాణా శాఖ ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని కార్మిక సంఘాలు ఆందోళనలు చేసినా ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసి చరిత్ర సృష్టించారన్నారు. విలీనం ద్వారా ఆర్టీసీ ఉద్యోగులకు మిగతా ప్రభుత్వ ఉద్యోగుల మాదిరే అన్ని సౌకర్యాలు అందుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు, ఏపీపీటీడీ ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

గడ్డివాముల దగ్ధం

కమలాపురం : కమలాపురం పట్టణంలోని ఎంపీడీఓ కాలనీలో నివాసం ఉంటున్న గంగవరం రామిరెడ్డికి చెందిన రెండు గడ్డి వాములు దగ్ధం అయ్యాయి. ఆదివారం సాయంత్రం ఈ ఘటన జరగడంతో గుర్తించిన స్థానికులు స్థానిక ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. అక్కడ ఫైరింజన్ లేకపోవడంతో కడప నుంచి వాహనం వచ్చి మంటలను ఆర్పింది. అయితే గడ్డి, మినుము పొట్టు వాములు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఎవరో గుర్తు తెలియని వ్యక్తి బీడీ ఆర్పకుండా పడేయడంతో ఈ ఘటన జరిగి ఉండవచ్చని, రూ.40 వేలు నష్టం వాటిల్లిందని యజమాని రామిరెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని ఆయన కోరాడు.

నడక ఉద్యమం ఉధృతం

రాజంపేట : నడకతోనే మెరుగైన ఆరోగ్యం అనే నినాదాన్ని ఉద్యమం రీతిలో ఉధృతం చేయాలని వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ మురళీమోహనరావు, తెలంగాణ, ఏపీ, ఒడిస్సా, తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల వైస్ ప్రెసిడెంట్ కొండూరు శరత్‌కుమార్‌రాజు తెలిపారు. ఆదివారం స్థానిక తాళ్లపాక రహదారిలోని శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్‌లో వాకర్స్ ఇంటర్నేషనల్ 157 కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు ఆలవార్ దాస్ చిత్రపటానికి పూలమాల నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంస్థ విశాఖలో ఆవిర్భవించిందన్నారు. దేశంలో పేదరిక నిర్మూలనకు కృషి చేస్తోందన్నారు. ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ శరత్‌కుమార్‌రాజు నేతృత్వంలో వాకర్ అసోసియేషన్ రాజంపేట (వార్) ఆధ్వర్యంలో ప్రెసిడెంట్ సుబ్బరామరాజు, సెక్రటరీ డా.టి.పెంచలయ్య, ట్రెజరర్ వెంకటయ్య ఆధ్వర్యంలో తలపెట్టిన కౌన్సిల్‌కు ఐదు రాష్ట్రాల నుంచి వాకర్ ఇంటర్నేషనల్ డెలిగేట్స్ తరలి వచ్చారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ సెక్రటరీ ప్రదీప్‌కుమార్, మాజీ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్లు వాకర్ రామానందం, నాగభూషణం, సుబ్బారెడ్డి, కృష్ణకుమారి, హనుమంతరావు పాల్గొన్నారు.

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న సర్కారు బడుల రూపురేఖలు మార్చేశారు.. పేదలకు సొంతింటి కల సాకారం చేస్తున్నారు. సచివాలయాల ద్వారా క్షణాల్లో ప్రతి పని జరుగుతోంది. ఫలితంగా పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్

ఉచితంగానే ధ్రువీకరణ పత్రాలు



ఒక్క రూపాయి ఖర్చు లేకుండా అవసరమైన ధ్రువీకరణపత్రాలు అన్నీ కూడా ఉచితంగా తీసుకోవడం జరిగింది. గతంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు రావాలంటే మండల కేంద్రంలో దరఖాస్తు చేసుకునేవాళ్లం. అవి ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉండేది. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అవసరమైన ధ్రువీకరణ పత్రాలన్నీ కూడా ఉచితంగా సచివాలయం ద్వారా అందజేస్తున్నట్లు వలంటీర్ ప్రవీణ్ చెప్పడంతో మా పిల్లలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నాం. రెండు రోజుల వ్యవధిలోనే ధ్రువీకరణ పత్రాలు వచ్చాయి. అంతేకాకుండా ఈబీసీ నేస్తం ద్వారా రూ.15 వేలు తీసుకున్నాము. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ కూడా అర్హులైన వారికి ఇస్తుండటంతో మేము ఎల్లప్పుడూ ఆయనకు రుణపడి ఉంటాం.

– బాదిరెడ్డిరత్నమ్మ, కాలువపల్లె, గోపవరం మండలం

సొంత ఇంటి కల నెరవేర్చిన జగన్



నాకు వివాహం అయ్యి దాదాపు 15 ఏళ్లు అయింది. అప్పటి నుంచి గత ప్రభుత్వాల పాలనలో ఇంటి స్థలం, ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం అర్హులకు ఇంటి స్థలం ఇచ్చారు. అందులో భాగంగా మాకు జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇచ్చారు. అలాగే అందులోనే హౌసింగ్ తరఫున ఇంటిని మంజూరు చేయించారు. ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న మా సొంత ఇంటి కలను నేరవేర్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నాం.

– గంగనపల్లి సావిత్రి, ఒంటిమిట్ట

ముఖ్యమంత్రి మేలు మరిచిపోము



నా పేరు మాదం వరలక్ష్మి. నా భర్త రామసుబ్బారెడ్డి. మేము వ్యవసాయ కూలీలం. ఆదాయం అంతంత మాత్రమే. మాకు ఇద్దరు పిల్లలు. కుమార్తె దివ్య ప్రస్తుతం ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. కుమారుడు సునీల్ కుమార్ డిగ్రీ చదువుతున్నాడు. దివ్య 9వ తరగతిలో ఉండగా మొదటి సారి నాకు అమ్మ ఒడి పథకం కింద ఆర్థిక సాయం అందింది. ఇప్పటికి రెండు సార్లు ఈ పథకం కింద ఆర్థిక సాయాన్ని అందుకున్నాను. అది పిల్లల చదువుకు ఎంతో ఉపయోగపడింది. అంతేకాదు మాకు సొంత ఇల్లు లేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడపడుచులకు ఇంటి స్థలాన్ని మంజూరు చేస్తున్నట్టు ప్రకటించడంతో నాకు ఇంటి స్థలంతోపాటు పక్కా ఇల్లు కూడా మంజూరైంది. ఇంటి స్థలం, ఇంటి విలువతోపాటు అమ్మఒడి ఆర్థిక సాయం కలిపి ప్రభుత్వం నుంచి నాకు రూ.8.89 లక్షల లబ్ధి చేకూరింది. ఒక కుటుంబానికి ఇంతకంటే ఏమి మేలు జరగాలి. అందుకే ముఖ్యమంత్రి మేలు మరిచిపోం.

– మాదం వరలక్ష్మి, బండివారిపల్లె, మైదుకూరు మున్సిపాలిటీ

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు


సింహాద్రిపురం : ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న టీడీపీ నాయకులు


కడప కార్పొరేషన్ : కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న డిప్యూటీ సీఎం, మేయర్

సింహాద్రిపురం : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీలోకి చేరికలు ఊపందుకున్నాయి. ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆదివారం సింహాద్రిపురం మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా మండల ఎన్నికల పరిశీలకులు గండ్లూరి వీరశివారెడ్డి ఆధ్వర్యంలో కసనూరు, హిమకుంట్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. బీటెక్ రవి సొంత గ్రామమైన కసనూరుకు చెందిన కరుడుగట్టిన టీడీపీ నాయకుడు మాజీ టీడీపీ మండల కన్వీనర్ నైజాం సుబ్బారెడ్డితోపాటు వెంకటనారాయణరెడ్డి, నిత్యానందరెడ్డి, పద్మనాభరెడ్డి, ఆర్.సుబ్బారెడ్డి, శివరామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి కుటుంబాలు చేరారు. వారికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పని చేసే వారికి ఎప్పటికీ సముచిత స్థానం ఉంటుందన్నారు. భారీ మెజార్టీతో గెలుపొందడానికి మీరు కూడా కృషి చేయాలన్నారు. అందుకు వారు మాట్లాడుతూ నియోజకవర్గంతోపాటు రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించడానికి కృషి చేస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి 200 కుటుంబాలు

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని 2వ డివిజన్ చలమారెడ్డిపల్లెలో మాజీ కార్పొరేటర్ బాల కొండయ్య ఆధ్వర్యంలో 200 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేశారు. వీరికి వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ సురేష్‌బాబు, డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, ఎంపీ రామచంద్రారెడ్డి ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డిలు కండువాల వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై జగన్ పాలనపై నమ్మకంతో పార్టీలో చేరుతున్న వారందరికీ అభినందనలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ సోషియల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, 2వ డివిజన్ కార్పొరేటర్ సుబ్బారెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

వల్లూరు : మండల పరిధిలోని దిగువపల్లె గ్రామ సమీపంలో ఆదివారం 9 మంది జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ వెంకటరమణ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి జూద స్థావరంపై దాడుల నిర్వహించి జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1, 01,020 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

కరెంటు షాక్‌తో యువకుడి మృతి

మరొకరికి గాయాలు


మృతి చెందిన సాగర్

లింగాల : విద్యుత్ షాక్‌తో ఓ యువకుడు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. విద్యుత్ పనుల కాంట్రాక్టర్ వద్ద కార్మికులుగా పని చేస్తున్న ఇద్దరు యువకులు మండలంలోని లోపట్నూతల– కోమన్నూతల గ్రామాల మధ్య విద్యుత్ లైన్‌లను సవరిస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యారు. భద్రాచలం జిల్లా మున్నూరు గ్రామానికి చెందిన సాగర్ (20) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, లక్ష్మణ్ అనే యువకుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. వెంటనే గాయపడిన యువకుడిని మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించినట్లు ఎస్సై బీవీ కృష్ణయ్య తెలిపారు. అభివృద్ధిలో భాగంగా కొత్త లైన్‌లు ఏర్పాటు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ సరఫరా అయి యువకుడు మృతి చెందినట్లు ఏఈ రమేష్ తెలిపారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై కోమన్నూతల సబ్‌స్టేషన్ పరిధిలో ముగ్గురు ఏఈల బృందం దర్యాప్తు చేస్తున్నట్లు ఏఈ తెలిపారు. దీనిపై బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నాసరుద్దీన్

రాజంపేట : రాజంపేట బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా సయ్యద్ నాసరుద్దీన్ ఎన్నికయ్యారు. సోమవారం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం కొలువు తీరనున్నది. బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా ఎస్.చంద్రశేఖర్, కోశాధికారిగా రమణ, వైస్‌ప్రెసిడెంట్‌లుగా వై.సురేష్‌రాజు, జల్లి నారాయణ ఎన్నికయ్యారు. మహిళ ప్రతినిధిగా బి.శోభారాణిని ఎంపిక చేశారు. కార్యవర్గంలో జాయింట్ సెక్రటరీలుగా హెచ్.సుదర్శన్‌రెడ్డి, ఎం.గోవర్ధన్‌రెడ్డి, నాగేశ్వర్ వీ.చౌదరిలు నియమితులయ్యారు. లైబ్రరీ అండ్ కల్చరల్ సెక్రటరీగా కె.శివకుమార్, గేమ్స్ అండ్ స్పోర్ట్స్ సెక్రటరీగా ఎస్.మహబూబ్‌బాషాలను ఎంపిక చేశారు.

ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల నుంచి ఆహ్వానం

నందలూరు (రాజంపేట) : తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు జీవితం, నైపుణ్యం, నేటి యువతకు అవసరమైన విషయాలపై ఏప్రిల్ 2వ తేదీన ఉపన్యసించడానికి తనకు ఆహ్వానం అందిందని రాజంపేట స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్ తెలిపారు.